


## పంటలుఎండిపోతున్నాయి
## రైతుల గోస ప్రభుత్వం పట్టించుకోదా..?



# సంగారెడ్డి మెదక్

మంగళవారం 13 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:08



# ఎల్‌నినో ప్రభావం...
## నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ఈ రబీ సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండాలి..
తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలి- డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ల వినియోగంతో నీటి పొదుపు- కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు పిలుపు

**అక్టోబర్ 12 మెదక్ జిల్లా బ్యూరో**

సోమవారం,రామాయంపేట లోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, కార్యక్రమం అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 76 రైతు వేదికల్లో ప్రత్యక్షంగా ఈ కార్యక్రమాన్ని రైతులు వీక్షిస్తున్నారన్నారు. మిగతా 2 లో

# రబీ సాగులో రైతులు పంటల ప్రణాళికపై దృష్టి సారించాలి

## - రాయికోడ్‌లో రైతు నేస్తం కార్యక్రమం





**రాయికోడ్ అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**

రానున్న రబీ సీజన్‌లో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని, శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో నిర్వహించారు. మిగతా 2 లో




# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## - నిరసనలో పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి, జుక్కల్ నేత లక్ష్మీకాంతారావు

**కల్వేర్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నాయకులు లక్ష్మీకాంతారావు, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు పి. చంద్రశేఖర్ రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు చేతులు పైకెత్తి నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. “జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి” అంటూ ఉన్న ప్లకార్డును ప్రదర్శిస్తూ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పంటలుఎండిపోతున్నాయి రైతుల గోస ప్రభుత్వం పట్టించుకోదా..?

మొదటిపేజీ తరువాయి

## - ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**అక్టోబర్ 12 ప్రజాజ్యోతి మెదక్ జిల్లా బ్యూరో**

శివంపేట మండలం చండి సబ్‌స్టేషన్ వద్ద, కౌడిపల్లి మండల కేంద్రంలో రైతులకు కనీసం 12 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నా కార్యక్రమాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.రైతులకు సరిపడా విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయానికి కనీసం 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి కోరారు. ఈ ధర్నాలో శివంపేట మండలం పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అలాగే కౌడిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు స్వరామ గౌడ్ పలువురు నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని ధర్నా విజయవంతం చేశారు.

# ఎల్‌నినో ప్రభావం... నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

మూడు లక్షల 14 వేల ఎకరాలు వరి సాగు చేయాల్సి ఉండగా ఏలేనో ప్రభావంతో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహనతో రైతులు కేవలం 01 లక్ష 94 వేల ఎకరాలు మాత్రమే వరి సాగు చేయడం జరిగిందన్నారు. నీటి ఎద్దడిని అధిగమించే విధంగా మిగతా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపి సాగు చేస్తున్నారన్నారు. గతంలో కంటే 28 వేల ఎకరాలు అధికంగా అంతర్ పంటలు పండిస్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాబోయే నెలల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున, అధిక నీరు అవసరమయ్యే వరి వంటి పంటల సాగు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి, పంటకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోతే రైతులు పెట్టిన పెట్టుబడిని కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంట నష్టపోతే రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలైన పప్పుధాన్యాలు మినుములు, పెసర్లు, శనగలు, కందులు, అలాగే నూనె గింజల పంటలైన వేరుశనగ, పొద్దు తిరుగుడు, కుసుమలు, నువ్వులు, తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు.రైతులు తమ వద్ద అందుబాటులో ఉన్న భూమి, నీటి వనరులు, వాతావరణ పరిస్థితులను బట్టి ఏ పంట సాగు చేయాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా పెట్టుబడి నష్టాలను నివారించుకోవచ్చని పేర్కొన్నారు.

**వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి**



ఎల్‌నినో ప్రభావం కారణంగా వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ పంటల సాగు విధానాల్లో అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. వర్షపాత అంచనాలు, సాగునీటి లభ్యత, పంటలకు అవసరమయ్యే నీటి పరిమాణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సాగు చేపట్టాలని తెలిపారు.ఒకసారి పంట సాగు ప్రారంభించిన తర్వాత నీటి కొరత ఏర్పడితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అందువల్ల ముందుగానే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సూచించారు. తక్కువ నీటితో పండే పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సేద్య విధానాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

**డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ల వినియోగానికి ప్రాధాన్యత**

సాగునీటి కొరతను అధిగమించేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ పద్ధతుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పంటలకు అవసరమైన నీటిని అందించవచ్చని తెలిపారు.సూక్ష్మ సేద్య పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం వరకు, జనరల్, ఓబీసీ వర్గాలకు చెందిన రైతులకు 80 శాతం వరకు సబ్సిడీ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.రైతులు తమకు అవసరమైన సూక్ష్మ సేద్య పరికరాల వివరాలను సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులకు అందించి, అర్హతను బట్టి ప్రభుత్వ సహాయాన్ని పొందాలని సూచించారు. ఈ విషయంలో రైతులకు అవసరమైన మార్గదర్శకాలను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రైతులకు అవసరమైన ఎరువులు, వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండాలిగ్రామాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులోకి తీసుకొచ్చిన విక్రయ కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలని సూచించారు.రాబోయే పంటల సాగుకు అవసరమైన ఇతర వ్యవసాయ ఉత్పాదకాలు కూడా రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్‌పై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ..రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీలు, వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వరి పంటను ఎట్టిపరిస్థితుల్లోనూ వేయకూడదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు వెళ్లాలని కోరారు.ప్రత్యామ్నాయ పంటల సాగు చేసిన రైతులు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమవారం,రామాయంపేట మండలం, గల రైతు వేదికలో నిర్వహిస్తోన్న రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సిపిఓ సురేష్ మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, నాలుగో అవార్డు కౌన్సిలర్ బైరం స్వప్న కుమార్, ఏడవ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, 11వ వార్డ్ కౌన్సిలర్ డాకీ శ్యామల స్వామి, రెండో వార్డ్ కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, ఆదర్శ రైతు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# రబీ సాగులో రైతులు పంటల ప్రణాళికపై దృష్టి సారించాలి

మొదటిపేజీ తరువాయి



**ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు వివరించారు.**

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రానున్న రబీ సీజన్‌కు ముందస్తు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ,నేల స్వభావం,వాతావరణ పరిస్థితులకు అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు, శాస్త్రీయ సాగు పద్ధతులు,సరైన యాజమాన్య విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం,వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించారు.సాగులో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి,వారి సలహాలు,సూచనలను పాటించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు,దేవాదాయ శాఖ చైర్మన్ సతీష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేదార్‌నాథ్ పాటిల్,మండల వ్యవసాయ అధికారి సారిక,వ్యవసాయ విస్తరణ అధికారులు నిఖిలేష్,అర్చన శ్రీ,కల్పనతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# అంత్యక్రియల వద్ద బంధువులెక్కడ?



## - సాంకేతికత పెరిగినా..ఆప్యాయత తగ్గుతోందా?..

**కొల్చారం,అక్టోబర్ 12ప్రజా జ్యోతి)**

ఒక మనిషి జీవితంలో జననం నుంచి మరణం వరకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తోడుగా ఉండటమే భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రతీక. ముఖ్యంగా అంత్యక్రియల వంటి విషాద సందర్భాల్లో బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారు కలిసి కుటుంబానికి అండగా నిలవడం మన సంస్కృతిలో భాగంగా కొనసాగింది. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం,బాధను పంచుకోవడం, అంత్యక్రియల నుంచి తదుపరి కార్యక్రమాల వరకు బాధ్యతను పంచుకోవడం ఒక సామాజిక విలువగా భావించేవారు. అయితే మారుతున్న జీవనశైలి, ఉపాధి కోసం వలసలు, చిన్న కుటుంబాల పెరుగుదలతో ఈ పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయనే చర్చ సమాజంలో సాగుతోంది. ఒకప్పుడు కుటుంబ బంధాలు కేవలం రక్తసంబంధాలతోనే కాకుండా పరస్పర ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, అనుబంధాలతో బలపడేవి. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, శుభకార్యం జరిగినా, విషాదం సంభవించినా బంధువులు ముందుగా ఇంటి గడప దాటేవారు. కాలం మారడంతో జీవనశైలిలో వచ్చిన మార్పులు కుటుంబ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం సామాజిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఉ పాధి, విద్య, ఉద్యోగాల కోసం పెద్దఎత్తున ఇతర నగరాలు, విదేశాలకు వెళ్లడం, అణు కుటుంబాల సంఖ్య పెరగడం, పనిఒత్తిడి అధికమవడం వంటి కారణాలతో కుటుంబ సభ్యులు ఒకే చోట ఉండే పరిస్థితులు తగ్గుతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అందరూ ఒకచోట చేరడం కొన్నిసార్లు సాధ్యం కాకపోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### - ఇటీవలి సంఘటనలు ఆలోచింపజేస్తున్నాయా...?

ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు ఒంటరిగా నివసిస్తూ మరణించిన తర్వాత రోజులకే విషయం వెలుగులోకి వచ్చిన ఘటనలు, అంత్యక్రియలకు బంధువుల కంటే స్థానికులు లేదా స్వచ్ఛంద సంస్థల సభ్యులే ముందుకు వచ్చిన సంఘటనలు వార్తల్లో కనిపించాయి. అలాగే విదేశాలు, ఇతర నగరాల్లో ఉన్న కుటుంబ సభ్యులు చేరుకునే వరకు మృతదేహాలను మార్చురీల్లో ఉంచాల్సిన పరిస్థితులు కూడా పలుచోట్ల ఎదురయ్యాయి. ఇలాంటి పరిణామాలు మారుతున్న కుటుంబ వ్యవస్థ, వృద్ధుల సంరక్షణ, సామాజిక బాధ్యతలపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయని సామాజిక పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### - ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నుంచి అణు కుటుంబాల దిశగా...?

ఒకప్పుడు మూడు, నాలుగు తరాలు ఒకే ఇంట్లో నివసించడం సాధారణం. పెద్దలు కుటుంబానికి దిక్సూచిగా ఉండేవారు. వారి అనుభవాలు కుటుంబ నిర్ణయాలకు మార్గనిర్దేశం చేసేవి. పిల్లలు, మనవళ్లు పెద్దలను చూసుకోవడం తమ బాధ్యతగా భావించేవారు. ప్రస్తుతం ఉద్యోగాలు, విద్య,జీవనావకాశాల కోసం కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడుతుండటంతో ఉమ్మడి కుటుంబాల స్థానంలో అణు కుటుంబాలు పెరిగాయి. బంధాలు పూర్తిగా తెగిపోలేదు గానీ,ప్రత్యక్ష అనుబంధం తగ్గిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

### - సాంకేతికత దగ్గర చేసింది... కానీ మనుషుల మధ్య దూరం తగ్గిందా...?

స్మార్ట్‌ఫోన్లు, వీడియో కాల్స్, సోషల్ మీడియా ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకొచ్చాయి. విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రులతో ప్రతిరోజూ మాట్లాడే అవకాశం ఏర్పడింది. అయితే అవసరమైన సమయంలో భౌతికంగా పక్కన ఉండే ఆప్యాయతకు సాంకేతికత పూర్తిగా ప్రత్యామ్నాయం కాలేదని సామాజిక పరిశీలకులు పేర్కొంటున్నారు. కుటుంబ బంధాలు కేవలం ఫోన్ సంభాషణలతో కాకుండా, అవసరమైన సమయంలో ఒకరికొకరు అండగా నిలవడం ద్వారా మరింత బలపడతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

### - వృద్ధుల సంక్షేమంపై మరింత దృష్టి అవసరం....?

వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అవసరమయ్యేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. ఆరోగ్య పరిరక్షణ, మానసిక భరోసా, కుటుంబ సభ్యుల ఆత్మీయత కూడా అంతే ముఖ్యమైనవి. కుటుంబ సభ్యులు దూరంగా ఉన్నా వారి ఆరోగ్యం, అవసరాలు, భద్రతపై నిరంతరం శ్రద్ధ చూపడం ప్రతి ఒక్కరి బాధ్యతగా నిపుణులు సూచిస్తున్నారు.

### - సమాజం పాత్ర కూడా కీలకమే....?

వృద్ధుల సమస్యలను కుటుంబాలకు మాత్రమే పరిమితం చేయకుండా సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని పలువురుఅభిప్రాయపడుతున్నారు. పొరుగువారు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సేవా సంస్థలు ఒంటరిగా ఉన్న వృద్ధులకు అవసరమైన సమయంలో అండగా నిలిస్తే వారికి ఎంతో భరోసా లభిస్తుందని చెబుతున్నారు.

### - సంపద కాదు.. చివరికి నిలిచేది అనుబంధాలే....?

జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా, ఎంత ఆస్తి సంపాదించినా చివరికి మనిషికి అవసర మయ్యేది కుటుంబ సభ్యుల ఆప్యాయత, బంధువుల పరామర్శ, స్నేహితుల అండ. "మాజం చూపే మానవత్వమే. తల్లిదండ్రులను గౌరవించడం, పెద్దలను ఆదుకోవడం, కుటుంబ బంధాలను నిలబెట్టుకోవడం ప్రతి తరానికి నైతిక బాధ్యత.

### - ఆలోచించాల్సిన సమయం ఇదే...?

నేటి సమాజంలో ఇప్పటికీ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకుంటూ వారి బాధ్యతలను నిర్వర్తిస్తున్న అనేక కుటుంబాలు ఉన్నాయి. అదే సమయంలో వెలుగులోకి వస్తున్న కొన్ని సంఘటనలు కుటుంబ బంధాలు, వృద్ధుల సంరక్షణ, సామాజిక బాధ్యతలపై మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవనశైలి మారడం సహజమే. అయితే ఆ మార్పులో మానవీయ విలువలు, కుటుంబ అనుబంధాలు, పెద్దల పట్ల బాధ్యత మనకబారకుండా కాపాడుకోవాల్సిన అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత పెరిగింది. సమాజం బలంగా ఉండాలంటే కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలి. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలంటే ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యత, మానవత్వం నిలిచి ఉండాలి. అదే భవిష్యత్ తరాలకు మనం అందించాల్సిన గొప్ప వారసత్వం.



# గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాత భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**పెద్ద శంకరంపేట ప్రజాజ్యోతి**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం కట్టెల వెంకటాపూర్ గ్రామంలో గ్రామ పురోహితులు సంతోష్ పంతులు,భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భవాని మాలధారణ,దీక్ష స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను గాయత్రి దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు,శాంతి,సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబంలో ఆనందం,ఐశ్వర్యం,కొత్త వెలుగులు నిండాలని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తి,శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాతను ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం విశేషమని పేర్కొన్నారు.నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు గ్రామంలో భక్తిభావాన్ని, ఐక్యతను చాటుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,భవాని ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# నూజివీడు ఆధ్య తో అధిక దిగుబడులు వచ్చిందన్న రైతులు

**వట్టిపల్లి అక్టోబర్12 ప్రజా జ్యోతి**

సంగారెడ్డి వట్టిపల్లి మండల్ మరవెల్లి గ్రామంలో రైతు పండరి చేనులో నిర్వహించిన ఆధ్య 1134 మెగా ప్రత్తి క్షేత్రానికి చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు వచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి ప్రవీణ్ రెడ్డి (జూ)సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధ్య ప్రత్తి రకంత్వరగా కాపుకు వచ్చి రెండవపంటకు అనుకూలంగా ఉంటుందని, ఈ వంగడం అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉంటుందని, అదేవిధంగా చీడపురుగుల నుంచి తట్టుకుంటుందని టోభాకో స్ట్రీక్ వైరస్ నుండి తట్టుకొని అధిక వర్షాలను కూడా తట్టుకొని మరియు బెట్ట పరిస్థితులలో కూడా అధిక దిగుబడి నిస్తుందని, అదేవిధంగా ఈ ప్రత్తి రకాన్ని అధిక సాంద్రత పద్ధతిలో వేసుకోవడానికి కూడా అనుకూలంగా ఉంటుంది దీనివల్ల రైతు యొక్క దిగుబడి పెరుగుతుంది. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు . రైతు యొక్క క్షేత్రంలో పత్తి కాయలు ఒక్కొక్క చెట్టుకు సగటున 60నుండి 84 వరకు ఉన్నాయి ఈ యొక్క ప్రత్తి క్షేత్రంలో దిగుబడి ఎకరానికి12 నుండి 14క్వింటాళ్ల వరకు రావచ్చుని రైతులు ఆశించారు. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ఆధ్యా ప్రత్తి రకం అధిక దిగుబడి ఇస్తుందని రైతులకు క్షేత్రంలో చూపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక డీలర్. ఎ. శంకరయ్య ఫర్టిలైజర్ యజమాని పాండరి ,నూజివీడు సీడ్స్ టీమ్ లీడర్ ప్రవీణ్ రెడ్డి గ్రామ రైతులు మరియు ఇతర చుట్టుపక్కల గ్రామాల రైతులు ఈ యొక్క ప్రత్తి క్షేత్రాన్ని వీక్షించడం జరిగింది. రైతులందరూ కూడా నూజివీడు వారి ఆధ్యాప్రత్తి రకం రైతులకు అధిక ఆదాయాన్ని ఇస్తుందని రైతులందరూ ఈ రకాన్ని వేసుకోవాలని సూచించడం జరిగింది.రైతులుకూడ ఈ రకాన్ని వేయటానికి ఆసక్తి చూపారు.




# సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభం

## - శిక్షణ తరగతులను ప్రారంభించిన జిల్లా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఎఎస్., జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు చేయూత అందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట కేంద్రాల్లో ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు.సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి







ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించిన అనంతరం ఉచిత కోచింగ్ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సాధన కోసం పోటీపడుతున్న అభ్యర్థులకు



జనరల్ స్టడీస్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు సమయపాలన పాటించి, క్రమం తప్పకుండా శిక్షణకు హాజరువ్వాలని అన్నారు.అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు చేయూతనందించి, పోలీసు ఉద్యోగాల సాధనలో సరైన మార్గదర్శకత్వం అందించేందుకు ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.అభ్యర్థులు పట్టుదలతో శ్రమించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఆర్డీఓ రాజన్న, మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## - అదనపు కలెక్టర్లు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పాండు, సంగీత అధికారులను ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.డివిజన్ల వారీగా సంగారెడ్డి నుంచి 15, నారాయణఖేడ్ నుంచి 2, జహీరాబాద్ నుంచి 2 అర్జీలు అందగా, కలెక్టరేట్‌లో 50 అర్జీలు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి అర్జీలు అందలేదు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్లు సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, హౌసింగ్ పీడీ చలపతిరావు, అదనపు డీఆర్డీఓ బాలరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ ఆర్. గౌతమి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ ఎస్.కె. పాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి నుంచి తుల్జాపూర్‌కు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న భవానీ మాత పాదయాత్ర

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి నుంచి సాహితీ రాము ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన తుల్జాపురం పాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ యాత్ర తాజాగా సదాశివపేట పట్టణానికి చేరుకుంది.? సదాశివపేటలోని శ్రీ దుర్గమ్మ గుడి వద్దకు చేరుకున్న పాదయాత్ర బృందం, తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఎర్ర నరసింహ గౌడ్ సన్నిధానంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం, యాత్ర బృందం తిరిగి భవానీ మాత నామస్మరణతో తుల్జాపూర్ వైపుగా తమ ప్రయాణాన్ని కొనసాగించింది.?ఈ పవిత్ర పాదయాత్రలో పరమేశ్వర్ గౌడ్, అజయ్, రవి తదితరులు భక్తులుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ గౌడ్, కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజు గౌడ్, చెన్నాకర్,ఎర్ర వీరేందర్,కనిగిరి కృష్ణ, గురు, రాజన్న తదితర ప్రముఖులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.




# గీతంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన

## - సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థుల్లో చైతన్యం
## - ఏఐ యుగంలో నిరంతర అభ్యాసమే
## - విజయానికి మార్గం.. పరిశ్రమ నిపుణుల సూచన







**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని అవగాహన కార్యక్రమాలతో నిర్వహించారు. మరోవైపు, కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతను వివరిస్తూ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో పరిశ్రమ నిపుణులతో ప్యానెల్ చర్చ నిర్వహించార 'అవగాహనతో ఉండండి.. దయతో మెలగండి.. మీలాగే ఉండండి' అనే ఇతివృత్తంతో నిర్వహించిన మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని అప్లైడ్ సైకాలజీ విభాగం, గీతం స్టూడెంట్ లైఫ్ సహకారంతో ఏర్పాటు చేసింది. హ్యుమానిటీస్ డీన్ డాక్టర్ రథిన్ రాయ్ కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. వివిధ స్టాళ్లను సందర్శించి కార్యకలాపాల ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు.మానసిక ఆరోగ్య పజిల్స్, ఆర్ట్ థెరపీ, స్కెచ్ స్టాళ్లు, అఫర్మేషన్ వాక్యాలు, కమిట్‌మెంట్ వాల్, భవిష్యత్తులో తమకు తామే ఉత్తరాలు రాసుకునే కార్యక్రమం, మానసిక ఆరోగ్య చెక్-ఇన్ బోర్డు వంటి వినూత్న కార్యకలాపాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. వీటితో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులు నేర్చుకోవడం, పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ ప్రేమ నైటీ జార్జ్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

**మారుతున్న ఉద్యోగ ప్రపంచానికి సిద్ధం కావాలి**

మరో కార్యక్రమంలో 'హెచ్ఆర్ విభాగ భవిష్యత్తు దిశానిర్దేశం: కార్మిక చట్టాలు, మారుతున్న చట్టపరమైన పరిస్థితులు' అంశంపై చర్చ నిర్వహించారు. గెయిన్‌సైట్ ఇండియా హెచ్ఆర్ సీనియర్ డైరెక్టర్ ఇ.హరిత, కార్య ఐటీ సొల్యూషన్స్ హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ శైలజ, ఇన్ఫోర్ మాజీ హెచ్ఆర్ విభాగాధిపతి బి.అనిల్ కుమార్ పాల్గొని కొత్త కార్మిక చట్టాలు, హెచ్ఆర్ విధానాలు, నైపుణ్యాల ప్రాధాన్యాన్ని వివరించారు.విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలని, ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని నిపుణులు సూచించారు. మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, భవిష్యత్తు సవాళ్లకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. డాక్టర్ కె.ఎన్. రేఖ చర్చను ప్రారంభించగా, డాక్టర్ కున్మాన్ మిశ్రా సమన్వయం చేశారు. ఎంబీఏ, బీబీఏ విద్యార్థులతో నిపుణులు ముఖాముఖి చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

## - ప్రజావాణిలోఫిర్యాదుదారుల సమస్యలు విన్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**అక్టోబర్ 12 ప్రజా జ్యోతిమెదక్ జిల్లాబ్యూరో**

ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాపోలీసుకార్యాలయంలోనిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతోవ్యవహరించాలని స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంట్ కష్టాలు

## -అనంతారంలో ఎండుతున్న పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు సీజీఆర్

## - విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్

**గుమ్మడిదల(ప్రజాజ్యోతి)**

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలు ఎండిపోతూ భూములు నెర్రబారుతున్న పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఎండిపోతున్న పంటలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి (సీజీఆర్) సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

**విద్యుత్ అంతరాయాలతో రైతులకు ఇక్కట్లు**

ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం వల్ల పంటలకు సకాలంలో నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న రైతులు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు మళ్లీ తలెత్తుతున్నాయని సీజీఆర్ విమర్శించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ అంతరాయాలను తక్షణమే నివారించి, సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు జింక గోపాల్, మహేష్ యాదవ్, తలారి మహేష్, శ్రీశైలం, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్‌లో హుక్కా పరికరం, పొగాకు ఫ్లేవర్స్ గుర్తింపు

## - గంజాయి వంటి మత్తు పదార్థాలు లభించలేదు: సిర్గాపూర్ ఎస్సై మహేష్

**కల్హేర్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం జమ్లా తాండ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్‌లో హుక్కా వినియోగిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుక్కా పరికరంతో పాటు పొగాకు ఫ్లేవర్స్‌ను గుర్తించినట్లు సిర్గాపూర్ ఎస్సై మహేష్ తెలిపారు.సమాచారం మేరకు సోలార్ ప్లాంట్ వద్దకు చేరుకున్న పోలీసులు అక్కడ లేబర్లుగా పనిచేస్తున్న కొంతమందిని తనిఖీ చేశారు. వారి వద్ద ఒక హుక్కా పరికరం, దానికి సంబంధించిన పొగాకు ఫ్లేవర్స్ లభించినట్లు ఎస్సై వెల్లడించారు. అయితే తనిఖీల్లో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు ఎలాంటి లభించలేదని ఎస్సై మహేష్ స్పష్టం చేశారు. హుక్కా పరికరం, పొగాకు ఫ్లేవర్స్‌కు సంబంధించి వివరాలను సేకరిస్తున్నామని, ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.




# శ్రీ వాణి నగర్ సమస్యలపై కమిషనర్ నజర్

## - డ్రైనేజీకి కొత్త లైన్ మంజూరు..

## - రోడ్ల పనులు పూర్తి చేస్తామని హామీ

## - కమిషనర్ శ్రీజన పర్యటనతో కాలనీవాసుల్లో ఆశలు





**అమీన్‌పూర్(ప్రజాజ్యోతి)**

ఏళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను పూర్తి చేస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్ హామీ ఇచ్చారు. అమీన్‌పూర్ సర్కిల్--47 పరిధిలోని 271వ డివిజన్ శ్రీ వాణి నగర్ కాలనీలో ఆమె పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. కాలనీవాసుల ఇబ్బందులను తెలుసుకుని, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్త లైన్ మంజూరు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు

**సమస్యలను పరిష్కరించాలని వినతి**

కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, రోడ్ల పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. సమస్యలను పరిశీలించిన కమిషనర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్త లైన్ మంజూరు చేశారు.



పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కారమైతే కాలనీలో నివాసితులకు ఇబ్బందులు తగ్గుతాయని. ప్రజా సమస్యలపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించడం అభినందనీయమని పేర్కొన్నారు. మంజూరైన డ్రైనేజీ లైన్ పనులను త్వరగా ప్రారంభించి, రోడ్ల పనులను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు.ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కారుపోతుల మహేష్ గౌడ్, శ్రీ వాణి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యక్షుడు సుమన్, శ్రీనివాస్ గుప్తా, అనంత రెడ్డి, పార్థసారథి, శ్రీకాంత్, యూ.వి. రమణ, చరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.
- ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణాదారుల అరెస్ట్, రెండు కార్లు సీజ్.
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం (12-10-2026) నాడు సంగారెడ్డి ఎస్-ఎన్ఏబి ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్సై మధుసూదన్ రెడ్డి, సిసిఎస్ ఎస్సై శ్రీకాంత్, సంగారెడ్డి టౌన్ ఎస్సై వెంకటేశం తమ సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు కంది ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న హైహుండాయ్ ఎక్సెంట్ (ఓడి ఓ2బీడి7922), మారుతి సుజుకి ఫ్రాన్స్ (ఓడిఓ2డీజే9920) కార్లను తనిఖీ చేయగా, హైహుండాయ్ ఎక్సెంట్ కారులో 35 ప్యాకెట్లలో తరలిస్తున్న 142.8 కిలోల ఎండు గంజాయిని గుర్తించడం జరిగింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.71,40,000/- ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, రెండు కార్లను సీజ్ చేశారు.
ఈ ఘటనపై సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సి ఆర్.నెంబర్ 588/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిందితుల వివరాలు:**

1. రోషన్ కర్జీ, తండ్రి ప్రసన్న కర్జీ, వయస్సు 26 సంవత్సరాలు, గొల్లి గ్రామం, గజపతి జిల్లా, ఒడిశా రాష్ట్రం.
2. బిబుధ రాజ్హా, తండ్రి బాతుయెల్ రాజ్హా, వయస్సు 22 సంవత్సరాలు, అడవ గ్రామం, గజపతి జిల్లా, ఒడిశా రాష్ట్రం.

**నిందితులను అరెస్ట్ చేసి, జ్యూడిషియల్ రిమాండుకు తరలించడం జరిగింది.**

సంగారెడ్డి జిల్లాలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, సరఫరా, విక్రయాలపై




జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగుతుందని, జిల్లాలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా లేదా సరఫరా చేసినా, ఎస్-ఎన్ఏబి నంబర్ 8712656777కు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి ఎస్-ఎన్ఏబి ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్సై మధుసూదన్ రెడ్డి మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ గారు అభినందించారు.

---

# ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి
- కొండాపూర్ మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొండాపూర్ మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజయ్య మాట్లాడుతూ.. ఢిల్లీలో జరుగుతున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు నగరవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మెట్రో స్టేషన్లను మూసివేయడం వంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. రవాణా మార్గాలకు ఆటంకాలు కల్పిస్తూ, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. దేశంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియలో జరిగినట్లు ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు పేర్కొంటున్న అవకతవకలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పటికీ, వాటికి సరైన సమాధానాలు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించడం ద్వారా రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను భద్రతాపరమైన ముప్పుగా చిత్రీకరిస్తూ ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శలను ఎదుర్కొనే శక్తి లేక కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియపై వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిశీలించి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబురావు, ప్రజాసంఘాల నాయకులు ఆసిఫ్ అలీ, సద్దాం, సుశీల, కవిత, నాగరాజు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా

# ముందస్తు చర్యలు చేపట్టాలి

## - ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

## - నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-**

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026--27 సీజన్‌లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఎల్ నినో ప్రభావం, యాసంగి పంటల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి వినియోగం, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, తాగునీటి సంరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి సంగారెడ్డి రైతు వేదిక నుంచి పాల్గొన్నారు.హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ అనుబంధ శాఖల కార్యదర్శులు, శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పుధాన్యాలైన పెసలు, మినుములు, శనగతో పాటు కుసుమ వంటి పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.







జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా విషయంలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిస్థితిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, రైతులు నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు.జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని, నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ.. ఉద్యోగ సాధనకు సువర్ణావకాశం!

## - జహీరాబాద్ నియోజకవర్గ యువతకు 45 రోజుల పాటు శిక్షణ



**జహీరాబాద్, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాల సాధనలో అండగా నిలిచేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు నగరాలకు వెళ్లి ప్రైవేట్ కోచింగ్ తీసుకోవాలంటే అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణ పొందలేని గ్రామీణ యువతకు ఈ ఉచిత శిక్షణ ఒక గొప్ప అవకాశంగా నిలవనుంది. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ షైన్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ నిపుణులైన అధ్యాపకులతో 45 రోజుల పాటు శిక్షణ అందించడం ద్వారా అభ్యర్థులకు పరీక్షలపై అవగాహన పెరగడం తో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన సన్నద్ధత లభించనుంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎస్సై క్రాంతి కుమార్ పటేల్ఈ సందర్భంగా ఝరాసంగం ఎస్సై క్రాంతి కుమార్ పటేల్ మాట్లాడుతూ, ఈ శిక్షణా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ, పట్టుదలతో సాధన చేసి పోలీస్ ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన మార్గ దర్శకత్వం అందించడంలో ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషించ నున్నాయి. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకుండా, యువత తమ లక్ష్యాలను చేరుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.